క్లుప్తంగా

వైభవంగా సీతారామలక్ష్మణ ప్రతిష్ఠ మహోత్సవాలు



హోమంలో పాల్గొన్న దంపతులు

ఒంగోలు మెట్రో: స్థానిక మామిడిపాలెంలోని హనుమత్ సమేత సీతారామలక్ష్మణ దేవస్థానంలో 41 రోజుల ప్రతిష్ఠ మహోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం ఏడు గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పురోహితుడు నాగమల్లేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కలశ స్నపనం, ఆంజనేయస్వామికి సహస్ర నాగావళి దళార్చన, తమలపాకులతో పూజ, కళావాహనం, కుంభ దర్శనం, అక్షితరోపణం, బ్రహ్మఘోష, మహదాశీర్వచనం, దీక్ష విరమణ, స్వామి, అమ్మవార్ల మూలవిరాట్లకు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, అలంకరణ, అర్చనాది కార్యక్రమాలు, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

సానికవరంలో ఆటల పోటీలు

పెద్దారవీడు: హనుమాన్ జయంతి సందర్భంగా మండలం పరిధిలో సానికవరం వీరాంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 30వ తేదీన స్లో బైక్ రైడింగ్, పరుగు పందెం, స్కిప్పింగ్, కబడ్డీ, కప్ప దూకుడు, 31వ తేదీన మహిళలకు ముగ్గుల పోటీలు, గంప కొట్టడం, తాడు లాగుట, మ్యూజికల్ చైర్స్, పాటలు పాడుట, అంత్యాక్షరి పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జూన్ 1వ తేదీ సాయంత్రం బహుమతులు అందజేస్తారని తెలిపారు. వివరాలకు ఫోన్ 79897 69829, 63027 80194 నంబర్లను సంప్రదించాలని కోరారు.

యోగా శిక్షణపై అవగాహన

పెద్దదోర్నాల: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా శిక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగాతో కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడి

పెద్దదోర్నాల: నలమల్ల అభయారణ్యంలోని ఇష్టకామేశ్వరి గుడి సమీపంలోని మర్రిపెంట వద్ద యువకుడిపై ఎలుగుబంటి దాడి చేసిన సంఘటన శనివారం జరిగింది. ఈ సంఘటనలో ఇష్టకామేశ్వరి గూడేనికి చెందిన కుడుమల బయ్యన్న తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని రేంజి అధికారి ఆరీఫ్‌ఖాన్ మార్కాపురం వైద్యశాలకు తరలించారు.

పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు

కొమరోలు: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని అల్లినగరం గ్రామంలో శనివారం పేకాట ఆడుతున్నట్లుగా సమాచారం అందుకున్న ఎస్సై మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పేకాట శిబిరంపై దాడులు చేశారు. ఈ దాడిలో రూ.10,500 నగదు స్వాధీనం చేసుకుని ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లుగా ఎస్సై తెలిపారు. ఎవరైనా పేకాట ఆడినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మధుసూదన్‌రావు హెచ్చరించారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పురోహితులు, అర్చకులు



భారీగా పాల్గొన్న భక్తులు

కన్నుల పండువగా..

- కొప్పోలులో చెన్నకేశవస్వామి కల్యాణం
- వైభవంగా స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం

ఒంగోలు మెట్రో: నగరంలోని కొప్పోలులో గల చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని యాగ్నిక నిర్వాహకులు నారాయణ వేణుగోపాల దీక్షితులు, పరాంకుశ చక్రవర్తి ఆధ్వర్యంలో శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పరాంకుశ సమీర్‌కుమార్ ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, అలంకరణ, అర్చనాది పూజా క్రతువులు నిర్వహించారు. మంగళహారతులతో భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణ క్రతువులో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల ఆశీసులు అందుకుని అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. సాయంత్రం ఆరు గంటలకు స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి వరదారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్తలు వెంకట శేషారెడ్డి పర్యవేక్షించారు.

బ్రాహ్మణ అన్నదాన సత్రం నిర్వాహకులకు సన్మానం



బ్రాహ్మణసత్ర నిర్వాహకులను సన్మానిస్తున్న బ్రాహ్మణ పెద్దలు

ఒంగోలు మెట్రో: వైశాఖమాసాన్ని పురస్కరించుకుని మల్లవరంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం స్వామి, అమ్మవారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లవరం దేవస్థానం పరిధిలో బ్రాహ్మణ అన్నదాన సత్రం నిర్వహిస్తున్న గౌరవ అధ్యక్షుడు గాలి నరసింహమూర్తి, అధ్యక్షుడు గాలి రంగసాయి, గౌరవ ఉపాధ్యక్షుడు నీలంరాజు శాంతారావు, కోశాధికారి రాచపూడి శ్రీకృష్ణ, కార్యవర్గ సభ్యులను ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్య సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మహంకాళి శేషయ్య మాట్లాడుతూ మల్లవరం కలియుగ వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వస్తున్న బ్రాహ్మణులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించడం చాలా గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి ఉప కార్యదర్శి భీమశంకరశాస్త్రి, ఎర్రన్న సాహితీపరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయి, బ్రహ్మశ్రీ ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పాన్నూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

జైలును ఆకస్మికంగా తనిఖీ చేసిన జడ్జి



జైలు అధికారితో మాట్లాడుతున్న జడ్జి

గిద్దలూరు రూరల్: స్థానిక సబ్ జైలును గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాదా నమ్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీల వివరాలను సూపరింటెండెంట్ లింగారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఖైదీలతో మాట్లాడుతూ క్షణికావేశంలో మీరు చేసిన తప్పులతో జైలు శిక్ష అనుభవిస్తు మీ కుటుంబ సభ్యులను కూడా ఇబ్బందులకు గురిచేశారన్నారు. శిక్ష పూర్తి అయిన తర్వాత ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మీకు వస్తున్న సదుపాయాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను నిల్వ ఉంచే స్టోర్ రూమ్, రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట కోర్టు సిబ్బంది ఉన్నారు.

ఖరీఫ్ సాగుకు విత్తనాలు సిద్ధం



రైతు భరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అనుగుణంగా నేలను సిద్ధపరుచుకొని పచ్చిరొట్ట పైర్లను ఆగు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం మండలంలోని మల్కాపురం, రజానగరం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రస్తుతం యాభై శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. వాటికి తోడు చిరుధాన్యాలు సజ్జ, జొన్న, కొర్ర, వరిగ, రాగి ఆరిక సాగు చేసుకోవచ్చన్నారు. సజ్జ సాగు మే నెలాఖరు వరకు సాగు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రైతులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. రైతులు దుక్కులు కలియదున్ని సాగు చేసుకోవచ్చన్నారు. చిరుధాన్యాలు మండలంలోని ప్రైవేట్ డీలర్ల వద్ద కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో డీలర్ల వద్ద నుంచి రసీదు పొందాలన్నారు. వీఏఏ కిషోర్, రైతులు ఉన్నారు.

విజ్ఞానానికి నిలయాలు గ్రంథాలయాలు

మార్కాపురం: విజ్ఞానానికి నిలయాలు గ్రంథాలయాలని గ్రంథపాలకుడు శివారెడ్డి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 7 వరకు మార్కాపురం గ్రంథాలయంలో శిక్షణ ఏర్పాటు చేశామని ఇందులో చెస్, పుస్తక పఠనం, పాటలు పాడటం, వ్యాసరచన, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. శనివారం నాటి శిబిరానికి కొల్లి విజయలక్ష్మి హాజరై ఏకాగ్రతపై వివరించారు. బ్రెయిన్ గేమ్స్ ఆడించారు. విద్యార్థులతో పాటలు పాడించారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, చెస్, కథలు చెప్పడం, పాటలు పాడించడం, డ్రాయింగ్‌పై శిక్షణ ఇచ్చారు. 32 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థినీ, విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి కోరారు.

కన్నుల పండువగా లక్ష్మీచెన్నకేశవునికి కళ్యాణం



ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామివారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీ.కేశవరావు, ఈవో జీ.శ్రీనివాస రెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

గురజాడ గేయాలతో ప్రారంభమైన

సమ్మర్ క్యాంపు



ఎల్బీజీ భవనంలో సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు టౌన్: ఒంగోలు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్బీజీ భవనంలో శనివారం సమ్మర్ క్యాంపు ప్రారంభమైంది. సుమారు 50 మందికిపైగా విద్యార్థులు ఈ శిబిరానికి హాజరయ్యారు. గురజాడ గేయాలతో క్యాంపు ప్రారంభం కాగా, అనంతరం క్రాఫ్టింగ్ నేర్చుకున్నారు. తోటి విద్యార్థులకు తెలిసిన వివరాలడిగి తెలుసుకున్నారు. తమకు తెలిసిన విషయాలను సహ విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ మాట్లాడుతూ చిన్నారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులు, చిన్నారుల్లో స్నేహభావాన్ని పెంపొందించడం, వారిలో సాటి మనుషులకు సాయపడాలన్న భావన పెంచడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ అనుకున్న లక్ష్యాలను సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నట్లు తెలిపారు. 8 రోజుల పాటు ఈ శిబిరాన్ని నిర్వహించనున్నామని, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో విద్యార్థులకు అవసరమైన సమాచారంతో పాటు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు రమాదేవి, జ్యోతి పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో 9వ రోజు...

జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం శనివారం 9వ రోజు కొనసాగింది. ఈ శిబిరంలో 100 మంది చిన్నారులు పాల్గొన్నారు. పిల్లలతో పుస్తకాలు చదివించి పుస్తక సమీక్ష చేయించారు. గణితం, లాజిక్ ఫజిల్స్ నేర్పించారు. ఇంగ్లిషులో ధారాళంగా మాట్లాడటం ఎలాగో వివరించారు. బొమ్మలు వేయడం, డ్యాన్స్ చేయడం లాంటి కార్యక్రమాలలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు జాలాది మోహన్, టి.రవీంద్ర, దాసరి లక్ష్మీప్రసాద్, షిరిడీ సాయిరాం, సీహెచ్ సుధాకర్, వెంకటేశ్వరరెడ్డి, విశ్రాంత సబ్ కలెక్టర్ పి.పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం



మెడికల్ ఆఫీసర్‌కు ఫ్రిడ్జ్ అందజేస్తున్న వాసవీ నాయకులు

ఒంగోలు రూరల్: ప్రజా సేవే వాసవీ క్లబ్ లక్ష్యమని వాసవీ మండల నాయకుడు పేరకం సుబ్బారావు అన్నారు. మండలంలోని కరవది పీహెచ్‌సీకి రూ.30 వేల విలువైన డబుల్ డోర్ ఫ్రిడ్జ్‌ను నాయకులు జ్వాలారావు, రంగా, మండల క్లబ్ నాయకుడు ఎస్వీ నారాయణ, శ్యాంబాబు, బదరీ నారాయణ, మల్లికార్జునతో కలిసి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్ ప్రసాద్, ఎంపీహెచ్ఓ కృష్ణారెడ్డిలకు శనివారం అందజేశారు. తొలుత ఫ్రిడ్జ్‌ను వాసవీ క్లబ్ శాఖ ప్రెసిడెంట్ జ్వాలారావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ సుందరప్రసాద్, కృష్ణారెడ్డి, శ్రీధర్, మహేష్, ఎస్.ఎన్.జ్యోతిలను క్లబ్ వారు సన్మానించారు. అనంతరం హాస్పిటల్ వారు సుబ్బారావు, జ్వాలారావు, ఎస్వీ నారాయణ, రంగనాయకులు, శ్యాంబాబు తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో సత్యం, సత్యనారాయణ, సూర్యనారాయణ, చరణ్‌సింగ్, మల్లికార్జునరావు, పాదర్తి శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ఉత్సవాలు



సోమేపల్లిలో వేణుగోపాలస్వామి ఉత్సవాలు

త్రిపురాంతకం: శ్రీరుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి వారి ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. మండలంలోని సోమేపల్లిలో శ్రీవేణుగోపాల స్వామి వారి ఉత్సవాల సందర్భంగా స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దంపతుల పూజలు జరిగాయి. మహిళలు పొంగళ్లు సమర్పించారు. అనంతరం స్వామి అమ్మవారి కల్యాణం వైభవంగ జరిగింది. భక్తులకు ఆశీర్వచనం అందించారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించండి

- కౌంటింగ్ రోజు గొడవలు పడొద్దు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: కౌంటింగ్ రోజున గ్రామాల్లో గొడవలు పడకుండా ప్రశాంత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కార్యకర్తలతో ముఖాముఖి మాట్లాడారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలు కార్యకర్తలు, నాయకులు పాల్గొని తమ గ్రామంలో జరిగిన పోలింగ్ సరళి తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన పార్టీ వైఎస్సార్ సీపీ అని చెప్పారు. ప్రతి కార్యకర్త కృషి, గెలుపు కోసం పట్టుదలతో పార్టీకి చేసిన సేవలను గుర్తుంచుకుని అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ప్రతి కార్యకర్త ఏ అవసరం వచ్చినా నేరుగా తమను కలవాలని సూచించారు.

వెలుగొండలో భక్తుల సందడి



శ్రీవారి ఆలయంలో భక్తుల పూజలు

- దాతల సహకారంతో భక్తులకు అన్నదానం



అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు శ్రీవారిని దర్శించుకొని పునీతులయ్యారు. అధిక సంఖ్యలో భక్తులు రావటంతో సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రతి శనివారం శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అన్నదాన సత్రం కమిటీ సభ్యులు జగన్, రత్నంశెట్టి, జవ్వాజి లక్ష్మీనారాయణ అన్నారు.

ఫోర్జరీ ధ్రువీకరణ పత్రంపై ఫిర్యాదు

గిద్దలూరు రూరల్: గ్రామ రెవెన్యూ అధికారి ఇచ్చినట్లు ఫోర్జరీ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించిన వారిపై స్థానిక పోలీసులకు వీఆర్ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్యతో పాటు రెవెన్యూ అధికారులు కలిసి ఫిర్యాదు చేశారు. మండలంలోని జయరాంపురం గ్రామ రెవెన్యూ పరిధిలో అసైన్‌మెంట్ 402 సర్వే నెంబరు 643/4 లోని 82.79 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని అవిజ అరుణకుమారికి చెందినట్లు గ్రామ రెవెన్యూ అధికారి ఈశ్వర్‌రెడ్డి సంతకం చేసినట్లు నకిలీ ధ్రువీకరణ పత్రం తయారు చేసుకున్నారు. వారు ఆ ధ్రువీకరణ పత్రం తీసుకుని సదరు స్థలాన్ని రిజిస్టర్ చేయించుకోవాలని రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళ్లారు. అసైన్‌మెంట్ భూమిపై ధ్రువీకరణ పత్రం ఎలా ఇచ్చాడని అనుమానం వచ్చిన రిజిస్ట్రర్‌శాఖ అధికారులు విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో రెవెన్యూ శాఖ అధికారులు ఈ విషయంపై విచారణ జరిపించాలని కోరుతూ స్థానిక సీఐ వైవీ సోమయ్యకు ఫిర్యాదు చేశారు. ఒక రెవెన్యూ అధికారి సంతకం పెట్టకున్నా దొంగ సంతకాలు పెట్టుకుని నకిలీ స్టాంపులు తయారు చేయించుకుని ఫోర్జరీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వీఆర్ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య కోరారు.

విజ్ఞాన తరగతులు వినియోగించుకోవాలి



విద్యార్థులతో ఎంఈఓ శ్రీనివాసులు

పెద్దారవీడు: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులను గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకాలు చదించడం నేర్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు పుస్తకంతో స్నేహం చేయాలని, స్నేహితుల కంటే కూడా పుస్తకం మంచి నేస్తమని తెలిపారు. నీతి కథల పుస్తకాలు చదవడం ఇతరులకు చెప్పడం అలవాటు చేసుకోవాలని సూచించారు. రోజూ గ్రంథాలయానికి వచ్చి దినపత్రికలు, పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. 25 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.